పార్టీని మరింత బలోపేతం చేయాలి


సుభాష్‌కు నివేదిక అందజేస్తున్న రవికుమార్‌యాదవ్, నాయకులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని బీజేపీ సభ్యత్వ నమోదు, బూత్ కమిటీల శేరిలింగంపల్లి ఇన్‌చార్జి సుభాష్ సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని మసీదుబండ కార్యాలయంలో పార్టీ రూపొందించిన పలు కార్యక్రమాలపై ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ బూత్ కమిటీలను త్వరగా ఏర్పాటు చేసి నాయకులంతా కలిసికట్టుగా ఏ ఎన్నికలు వచ్చినా పార్టీ విజయం సాధించేలా కష్టపడి పనిచేయాలన్నారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ డిసెంబర్ 20 లోగా 622 బూతు కమిటీలను ఏర్పాటు చేసి పార్టీకి నివేదిక అందిస్తామన్నారు. అనంతరం బూతు కమిటీల ఏర్పాటు, డివిజన్ అధ్యక్షుల నియామకం క్రియాశీల సభ్యులకు సంబంధించిన పలు విషయాలను చర్చించారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్రరావు, అశోక్, మణిభూషణ్, వేణుగోపాల్, మహిపాల్‌రెడ్డి, బసంత్‌యాదవ్, ఆంజనేయులు, కృష్ణ, రాజుశెట్టి, మాణిక్‌రావు, నర్సింగ్ రావు, మనోహర్‌గౌడ్, జితేందర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన


వివేకానంద వృద్ధాశ్రమంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మియాపూర్: ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి చందానగర్ సౌజన్యంతో వివేకానంద సేవా సంఘ వృద్ధాశ్రమంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా వైద్యులు అనూష, అక్షయ్ కుమార్, విజన్ ఐకేర్ డాక్టర్ రాము వృద్ధులకు ఎత్తు, బరువు, కంటి, దంత, బీపీ, షుగర్, పల్స్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోజు వ్యాయామం, యోగా, కనీసం 40 నిమిషాల పాటు తప్పకుండా నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు సుందరప్రసాద్, సంఘ సేవకుడు వెంకట్, ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు పాలం శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్, ఆసుపత్రి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిహారిక ల్యాండ్ మార్క్‌లో..

శేరిలింగంపల్లి: ఇండో–బ్రిటీష్ అడ్వాన్స్‌డ్ పేయిన్ క్లీనిక్, నంది ఆస్పత్రి సంయుక్తా ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ నిహారిక ల్యాండ్ మార్క్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగమణి పలువురికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బ్యాక్ పేయిన్, నీ పేయిన్, షోల్డర్ పేయిన్ తదితర సమస్యలతో బాధపడే వారికి ఇలాంటి శిబిరాలు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఇండో–బ్రిటీష్ అడ్వాన్స్‌డ్ పేయిన్ క్లీనిక్ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ శరణ్, ప్రతినిధి నాగరాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసాతో ప్రశాంతత

బజరంగ్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాములు


హనుమాన్ చాలీసా పారాయణంలో భక్తులు

పటాన్‌చెరు టౌన్: హనుమాన్ చాలీసా పారాయణంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బజరంగ్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివ రాములు అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామంలోని మల్లన్నస్వామి దేవస్థానంలో హ నుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ప్రత్యేక పూజల్లో పాల్గొని, అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సంగారెడ్డి జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు పవన్, జిల్లా కార్యదర్శి ప్రకాశం, న్యాయవాది నాగరాజు యాదవ్, స్వామి వివేకానంద సేవ సమితి జిల్లా అధ్యక్షుడు శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి గద్దె దిగడం ఖాయం


మాజీ మంత్రి హరీశ్‌రావు


మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

పటాన్‌చెరు: ముఖ్యమంత్రి హైడ్రా పేరుతో అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోని భవంతులను కూలుస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం రాత్రి అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న ఐలాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అక్కడి నుంచి కేసీఆర్ క్రికెట్ టోర్నీ ఫైనల్ జరిగే ప్రాంతానికి వెళ్లి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ రైతుల మేలు కోసం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెడితే.. రేవంత్ రెడ్డి ఆ పథకాన్ని ఆపేశారన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్ పూర్ ప్రాంతం ఎంతో అభివృద్ధి దిశగా నడుస్తోందన్నారు. కానీ ఏడాదిగా ఇక్కడ హైడ్రా పేరుతో కూల్చివేతలు జరుగుతున్నాయన్నారు. కూల్చివేతలే తప్ప ఒక్క ఇల్లు కట్టించారా..? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో సినీ నటుడు అల్లు అర్జున్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. దేవుళ్ల మీద ఓట్లు పెట్టి కూడా పూర్తిస్థాయిలో రుణ మాఫీ చేయలేదన్నారు. గుండెపోటుకు గురైన లగచర్ల రైతుకు బేడీలు వేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కనీసం రాహుల్ గాంధీ అపాయిట్‌మెంట్ కూడా రేవంత్‌కు ఇవ్వడం లేదని విమర్శించారు. త్వరలోనే సీఎం గద్దె దిగడం ఖాయమన్నారు. అలాగే ఐలాపూర్‌లో క్రికెట్ టోర్నీ నిర్వహించిన మాణిక్ యాదవ్‌ను అభినందించారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర నాయకులు ఆదర్శ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో రోడ్డు నిర్మాణం

- రూ.20 లక్షలతో 60 ఫీట్ల రహదారి పనులు
- దాతృత్వం చాటుకున్న వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఉపేంద్రనాథ్‌రెడ్డి

మణికొండ: వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు బీ ఉపేంద్రనాథ్‌రెడ్డి సొంతంగా రూ. 20 లక్షలతో 60 అడుగుల రోడ్డుతో పాటు డివైడర్ నిర్మించి దాతృత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మణికొండ మున్సిపాలిటీ, ఏడో వార్డు పరిధిలోని వెంకటేశ్వకాలనీ, డాక్టర్ వైఎస్ఆర్ కాలనీలను అనుసందానం చేసేలా లే అవుట్‌లో 60 అడుగుల వెడల్పుతో రోడ్డు ఉంది. దాన్ని అభివృద్ధి చేస్తే రెండు కాలనీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలుమార్లు కాలనీ వాసులు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా వారు పట్టించుకోకపోవడంతో ఆయన స్పందించి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. శనివారం రాత్రి సదరు రోడ్డును పూర్తిగా చదును చేయించి బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసి అంతేగాకుండా మధ్యలో డివైడర్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. దాంతో రెండు కాలనీల ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కబ్జాలు చేస్తున్నారనే..

వెంకటేశ్వర కాలనీలోని పార్కులు, ఖాళీ స్థలాలు, రోడ్లను కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఉపేంద్రనాథ్‌రెడ్డి మండిపడ్డారు. వారికి అండగా నిలుస్తున్న ప్రజాప్రతినిధులు కొందరు వాటిని అభివృద్ధి చేయకుండా మిన్నకుంటున్నారని మండిపడ్డారు. ఇటీవలే హైటెన్షన్ వైర్ల కింద నుంచి లేఅవుట్‌లో ఉన్న 100 అడుగుల రోడ్డును ఏకంగా ఓ ఫంక్షన్‌హాల్ నిర్వాహకుడు కబ్జా చేసి 30 అడుగులకు కుదించాడన్నారు. ప్రస్తుత రోడ్డుకు అలాంటి పరిస్థితి రావద్దనే ఉద్దేశంతోనే ముందుగానే అభివృద్ధి చేశానని ఆయన తెలిపారు.

డంపింగ్ యార్డును తరలించాలి

కాలనీవాసుల ధర్నా


దీప్తిశ్రీనగర్ కాలనీలో ధర్నా చేస్తున్న కాలనీవాసులు

మియాపూర్: కాలనీ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును తరలించాలని, అలాగే చెత్త సేకరణ ఆటోలు, టిప్పర్ లారీలు కాలనీ గుండా డంపింగ్ యార్డుకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని దీప్తిశ్రీనగర్ కాలనీ, శాంతినగర్, ఉషోదయ అపార్ట్‌మెంట్లతో పాటు పలు కాలనీసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు 'డంపింగ్ కాలుష్యం నుంచి కాపాడుకుందాం.. మా కాలనీ ముద్దు.. డంపింగ్ యార్డు వద్దు' అని దీప్తిశ్రీనగర్ కాలనీలో వారు ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ నుంచి వెళ్లే వాహనాలను అడ్డుకోగా చెత్త సేకరణ ఆటోలు, లారీలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారి రవి అక్కడికి చేరుకుని కాలనీవాసులతో మాట్లాడి వాటిని డంపింగ్ యార్డుకు పంపించి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ దీప్తిశ్రీనగర్ కాలనీ పక్కన ఖాళీ స్థలంలోని డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన వచ్చి అనారోగ్య పాలవుతున్నామన్నారు. ఇక్కడి యార్డుకు ప్రతిరోజు కేవలం 120 వాహనాల్లో చెత్త తీసుకువచ్చేందుకు అనుమతి ఉందని కానీ చందానగర్ సర్కిల్, శేరిలింగంపల్లి సర్కిల్‌లోని అన్ని డివిజన్ల నుంచి సుమారు 800 నుంచి 1200 వాహనాలు డంపింగ్ యార్డుకు తిరుగుతున్నాయి. అధికారులు సత్వరమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. చందానగర్ సర్కిల్ వైద్యాధికారి రవి మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో మాట్లాడి కాలనీ వాసుల సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని, కాలనీ గేటు వద్ద ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సీతారామయ్య, పూర్ణచందర్‌రావు, సురేశ్, సాయినాథ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాఘవేందర్‌రావు, చంద్రశేఖర్ రావు, రవి, రమణ, బబ్లు, నారాయణ, చైతన్య, ఉషోదయ సిగ్నేచర్ అపార్ట్‌మంట్, శాంతినగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.


రోడ్డుపై నిలిచిన చెత్త తరలింపు ఆటోలు

ఘనంగా 'దత్త' జయంతి వేడుకలు


పూజలు చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్లు

శేరిలింగంపల్లి: భెల్ ఎంఐజీ కాలనీలో గురు సాయిబాబా మందిరంలో శ్రీ దత్త జయంతి మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, సింధు ఆదర్శ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జీ మోహన్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు అనితా ప్రసాద్, సావిత్రీ, మాజీ డైరెక్టర్ సత్యనారాయణ, లక్ష్మి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ


బీఆర్ఎస్ నాయకుడు సాయిబాబాను సత్కరిస్తున్న భక్తులు

రాయదుర్గం: గౌలిదొడ్డిలో దారుగుపల్లి పరమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వామి మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామిని దర్శించుకున్న శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకుడు కొమిరిశెట్టిసాయిబాబాను దీక్షాపరులు సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాగం జంగయ్యయాదవ్, నరేశ్, దారుగుపల్లి నరేశ్, పెద్దగోని రమేశ్‌గౌడ్, అజయ్‌గౌడ్ , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సందడిగా స్పోర్ట్స్ డే


పిరమిడ్ ఆకారంలో విద్యార్థులు

గచ్చిబౌలి: మాదాపూర్ బచపన్, అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం స్పోర్ట్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటే, పిరమిడ్స్, డిల్స్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. ఆటల్లో విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని బచ్‌పన్ స్కూల్ ప్రిన్సిపాల్ నిషా పేర్కొన్నారు.

చర్చిల అభివృద్ధికి సహకారం

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: చర్చిల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటీ గ్రామ కమాన్ సమీపంలోని మరణాత చర్చిలో వంటశాల నిర్మాణానికి రూ.6 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు కార్పొరేటర్ మెట్టు కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లలిత సోమిరెడ్డి , శంకర్,చర్చ్ పాస్టర్ భాస్కర్ రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఊర పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారణలో అమ్మవారు


వేపచెట్టుకు పూజలు ..


బొడ్రాయికి పూజలు..

రాయదుర్గం: శ్యామ్‌లేట్ వీధిలోని ఊరపోచమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకారం, నిమ్మకాయల హారం వేసిన తర్వాత చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఇదిలా ఉండగా ప్రతి ఆదివారం ఆలయం ఎదుట ఉనన వేపచెట్టును కూడా అమ్మవారితో సమానంగా భావించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరను కూడా అర్చకుడు పండిట్ సంతోష్‌మిశ్రా పూజలు చేసి కట్టించారు. అంతేగాకుండా ఆలయం ఎదుట ఉన్న బొడ్రాయికి కూడా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఉపేందర్, నిర్వాహక ప్రతినిధి గణేశ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

24 ఏళ్లకు ఒకే వేదికపై..

చందానగర్: కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000–01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని మియాపూర్ ఆల్విన్ కాలనీ చౌరస్తాలోని అతిథి బాంకెట్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అలాగే ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ఉల్లాసంగా గడిపారు. సమ్మేళనంలో ఉపాధ్యాయులు పద్మావతి, స్వర్ణలీలా, రామలింగరాజు, శ్యామలాదేవి, విజయమ్మ, ఈశ్వరమ్మ, కృష్ణారెడ్డి, సౌభాగ్య లక్ష్మి, పూర్వ విద్యార్థులు సోమేశ్, భూపతి, రవి, రాజు, రమేశ్, రమేశ్, సాద నరేశ్, సురేందర్, సతీశ్, నాగరాజు, లక్ష్మి, ఫాహీమ, ఆర్తి కౌర్, వసంత, జ్యోతి, ప్రతిభ, పద్మ పాల్గొన్నారు.


కూకట్‌పల్లి జడ్పీ పాఠశాల 2000-01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: ఆపద సమయంలో సీఎం సహాయనిధి నిరుపేదలకు అండగా ఉంటోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల గ్రామానికి చెందిన భోగయ్య కుమారుడు శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సాయం కోసం స్థానిక ఎమ్మెల్యేను విన్నవించగా సీఎం సహాయనిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజాపాలన అందిస్తున్నామని అన్నారు.

ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు తదితరులు

పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా 60 మంది లబ్ధిదారులుకు మంజూరైన 24 లక్షల 12 వేల 500 రూపాయల ఆర్థిక సహాయానికి చెందిన సీఎంఆర్ఎఫ్ చెక్కును కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి బాధిత కుటుంబాలకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకు సహకారం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, ఊట్ల కృష్ణ,దొడ్ల రామకృష్ణ గౌడ్, పురేందర్‌రెడ్డి, కాశీనాథ్ యాదవ్, చిరుమర్తి రాజు, సుబ్బయ్య యాదవ్, శేఖర్, ఎర్ర నర్సయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో. టమాట రూ. 25, పచ్చిమిర్చి 40, బెండ 50, కాకర 50, దొండ 50, దోస 40, ఆలు 40, చామ 50, కీర 40, బీర 70, వంకాయ 30, గోకర 45, బీన్స్ 50, బీట్‌రూట్ 50, క్యాప్సికం 50, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 50, ఉల్లి 60 (కేజీ), ములక్కాయలు (1) 30 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 70, వెల్లుల్లి 400.

ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. డివిజన్ పరిధిలోని సాయిబాలాజీ ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ రాం ప్రభు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 5 కే రన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సుప్రజా ప్రవీణ్, రాచమల్లు నాగేశ్వర్‌గౌడ్, మహేశ్‌యాదవ్, చంద్రికప్రసాద్‌గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని సన్మానిస్తున్న సాయిబాబా తదితరులు

రాయదుర్గం: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని కొండాపూర్‌లోని ఆయన నివాసంలో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లిలో పార్టీ పరిస్థితి, అధిష్టానం ఇచ్చే పిలుపునకు అనుగుణంగా చేపట్టిన కార్యక్రమాలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు దారుగుపల్లి నరేశ్, పెద్దగోని రమేశ్‌బాబు, అజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఓక్ ట్రీ స్కూల్ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

చందానగర్: మదీనాగూడలోని ఓక్ ట్రీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్కూల్ డైరెక్టర్ గాయత్రీరావు, అపర్ణ సురభి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. 2017 సంవత్సరంలో స్కూల్ ప్రారంభం కాగా ఎనిమిదో వార్షికోత్సవం జరుపుకుంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

రాయల్‌ఓక్ నుంచి..న్యూ ఇయర్ కలెక్షన్స్

సాక్షి, సిటీబ్యూరో: నూతన సంవత్సరం, పండుగలను పురస్కరించుకుని ప్రత్యేక కలెక్షన్స్ అందిస్తున్నట్లు ప్రముఖ ఫర్నీచర్ తయారీ సంస్థ రాయల్ ఓక్ సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. క్రిస్మస్ మొదలుకుని రానున్న పండుగల సీజన్‌తో పాటు, న్యూ ఇయర్‌లో కొనుగోలు చేసేవారి కోసం అమెరికన్, ఇటాలియన్, మలేషియన్ బ్రాండ్స్‌కు చెందిన లివింగ్ రూమ్ సెట్స్, హోమ్ డెకార్, అవుట్ డోర్ ఫర్నీచర్ అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇయర్ ఎండ్ సేల్‌లో భాగంగా ధరల్లో రాయితీలు, డిస్కౌంట్లు కూడా ఉన్నాయన్నారు.

మాదాపూర్‌లో వై2డ్రైవ్ రెస్టారెంట్ ప్రారంభం


రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మాదాపూర్: మాదాపూర్‌లోని దుర్గం చెరువు వద్ద వై2 డ్రైవిన్ రెస్టారెంట్‌ను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఉదయం అన్ లిమిటెడ్ బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని రకాల వెజ్, నాన్‌వేజ్ బ్రేక్‌ఫాస్ట్‌లు అందించనున్నారు. నిర్వాహకుడు గజ్జల శీనురెడ్డి మాట్లాడుతూ రాయలసీమ, ఆంధ్ర, తెలంగాణ రుచులను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాదాపూర్ సీఐ కృష్ణమోహన్, గజ్జల శృతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పగిలిన మంజీరా పైప్‌లైన్

మణికొండ: మంజీరా, సింగూరు రిజర్వాయర్ నుంచి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ పెద్దాపూర్ గ్రామం వద్ద ఆదివారం మధ్యాహ్నం పగిలిపోయింది. దీంతో నీటి సరఫరాను నిలిపివేసి మరమ్మతులు మొదలు పెట్టారు. సోమవారం రాత్రి వరకు నీటి సరఫరా ఉండదని ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు కోరారు.

'ప్రతీ సమస్యను వెంటనే పరిష్కరిస్తా'

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలోని ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరిస్తానని మాజీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. బస్తీలోని రోడ్డు నెంబర్ 9 బ్లాక్ సిలో భూగర్భ డ్రైనేజీ రోడ్లపై మురుగు పారుతున్న సమస్యను చంద్రారెడ్డి దృష్టికి బస్తీవాసులు తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం జీహెచ్‌యంసి సిబ్బంది చేపట్టిన పనులను ఆయన దగ్గరుండి పరిశీలించారు. బస్తీలో ప్రతి సమస్యను పరిష్కరించి ఆదర్శవంతమైన బస్తీగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తానని హామీనిచ్చారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు సహకరిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులకు, బస్తీ వాసుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.